క్లుప్తంగా

యానిమేటర్లపై చర్యలకు సిఫారసు!

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో నిబంధనలు అతిక్రమించి విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో పాటు నిధుల దుర్వినియోగం ఆరోపణలు ఎదుర్కొంటున్న యానిమేటర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా డీఆర్‌డీఏ శాఖకు మండల వెలుగు సమాఖ్య ఫిర్యాదు చేసింది. దీంతో డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ డీవీఎల్ అన్నపూర్ణ ఆదేశాల మేరకు మండలంలోని రెండు గ్రామాలకు చెందిన యానిమేటర్లకు స్థానిక అధికారుల బృందం ఈ మేరకు సోమవారం నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న యానిమేటర్లు మంగళవారం ఉదయం 10 గంటలకు ముమ్మిడివరంలోని డీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయానికి వెళ్లి ఉన్నతాధికారుల ముందు హాజరై సంజాయిషీ ఇచ్చుకోవాలని ఆ నోటీసులో పేర్కొన్నట్లు చెబుతున్నారు. దీంతో మండల వ్యాప్తంగా వీఓఏలు, గ్రామ శక్తి సంఘాల్లో సర్వత్రా తీవ్ర ఆందోళన నెలకొంది.

రూరల్ బ్యాంకు మాజీ చైర్మన్ మృతి



నయినాల వెంకట స్వామినాయుడు

మామిడికుదురు: నగరం రూరల్ బ్యాంకు మాజీ చైర్మన్ నయనాల వెంకట స్వామినాయుడు (84) అనారోగ్యంతో ఆదివారం రాత్రి విశాఖపట్నంలో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామం మామిడికుదురు తీసుకువచ్చారు. ఆయన మామిడికుదురులోని నగరం రూరల్ బ్యాంకు చైర్మన్‌గా రెండు పర్యాయాలు పని చేశారు. మామిడికుదురు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. మామిడికుదురు శివాలయం, విష్ణాలయం, కోదండరామాలయం నిర్మాణాలకు భారీగా విరాళాలు ఇచ్చిన దాతగా గుర్తింపు పొందారు. వెంకటస్వామినాయుడు అంత్యక్రియలు మంగళవారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య విజయభారతి, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. వెంకటస్వామినాయుడు మృతికి పలువురు సంతాపం తెలిపారు.

నేడు రావులమ్మ తీర్థం

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో వేంచేసిన రావులమ్మ అమ్మవారి తీర్థాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించనున్నారు. సుమారు పది రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలను వివిధ సామాజిక వర్గాల వారు ఘనంగా సేవలు చేశారు. సోమవారం రాత్రి జరిగిన జాతరలో గరగ నృత్యాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



గుమ్మిలేరులో వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. వేంకటేశ్వరస్వామి 36వ వార్షిక కల్యాణం పురస్కరించుకుని తొలుత స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఆలయ ప్రధాన అర్చకులు విజయకుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య దేవతామూర్తుల విగ్రహాలకు వేద పండితులు శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. గ్రామానికి చెందిన గుణ్ణం త్రిసోను, శ్రీసంయుక్త దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వేంకటేశ్వర స్వామి భక్తి మండలి ఆలపించిన స్వామివారి భక్తి గీతాలు ఆలాపన విశేషంగా ఆకట్టుకుంది. రెడ్డి సత్తిబాబు, వై.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంతా కృష్ణమయమే..

అయినవిల్లి: ఈ అనంత లోకాలు కృష్ణమయమే, ఆయన మెచ్చేటట్టు మనం జీవించాలని అప్పుడు మానవ జీవితం సార్థకం అవుతుందని నల్లచెరువులోని అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్ నిర్వాహకుడు, ప్రభుజీ సుందర శ్రీనివాసదాస్ అన్నారు. సోమవారం ఏకాదశి పర్వదినం సందర్భంగా నల్లచెరువులో శ్రీకృష్ణుని తత్వాన్ని శ్రీనివాసదాస్ బోధించారు. భగవత్ గీత మన రాతను మారుస్తోందన్నారు. భగవత్ గీతను విన్నా చదివినా జన్మ చరితం అవుతుందన్నారు. భగవంతుడు సూచించిన దారిలోనే మనం ప్రయాణించాలని ఆయన సూచించారు. ఆయన సేవలో తరించిన వారికే మోక్షం లభిస్తుందన్నారు. దేవాధిదేవుడు సేవ చేయడం కూడా పూర్వజన్మ సుకృతమేనన్నారు. అనంతరం భక్తులు స్వామి అన్నప్రసాదం స్వీకరించారు.

బెల్టుషాపుపై పోలీసుల దాడి

కాట్రేనికోన: మండలంలోని బలుసుతిప్పలో అనధికారికంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్న బెల్టు షాపుపై పోలీసులు సోమవారం దాడి చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి 3 కేసుల నాన్ డ్యూటీ పెయిడ్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ప్రమాదపుటంచున కల్వర్టు



తీర ప్రాంత గ్రామాలకు మెండుపాలెం వద్ద శిథిల కల్వర్టుపై ఉన్న ప్రధాన రహదారి



మెండుపాలెం వద్ద డ్రెయిన్‌పై దెబ్బతిన్న కల్వర్టు గడ్డర్లు

- కూలేందుకు సిద్ధంగా ఉన్న వైనం
- గడ్డర్లకు పగుళ్లు
- పూర్తిగా దెబ్బతిన్న రక్షణ గోడలు

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం గ్రామ శివారు మెండుపాలెం వద్ద శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌పై పూర్వం నిర్మించిన కల్వర్టు పూర్తి శిథిల స్థితికి చేరింది. అలాగే కల్వర్టు రక్షణ గోడలు సైతం విరిగి పడ్డాయి. శిథిల స్థితికి చేరుకున్న కల్వర్టు స్థానే కొత్త కల్వర్టును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. రాజోలు నియోజకవర్గంలోని సఖినేటిపల్లి, మలికిపురం, మామిడికుదురు మండలాల్లోని తీర ప్రాంత గ్రామాలకు అనుసందానంగా ఈ వంతెన ఎంతో ప్రాధాన్యత ఉంది.

తీరం వెంబడి గ్రామాలకు..

సఖినేటిపల్లి మండలంలోని పల్లిపాలెం, అంతర్వేది దేవస్థానం, అంతర్వేదికర, కేశవదాసుపాలెం, మలికిపురం మండలం చింతలమోరి, శంకరగుప్తం, పడమటిపాలెం, కేశనపల్లి, తూర్పుపాలెం, గొల్లపాలెం, మామిడికుదురు మండలం కరవాక వరకూ తీర ప్రాంత గ్రామాల ప్రజలు రాకపోకలకు ఎంతో అనువుగా ఈ కల్వర్టును అప్పట్లో నిర్మించారు. తీరం వెంబడి సుమారు 25 కిలోమీటర్లు మేర పై గ్రామాల ప్రజలు, రైతులు రాకపోకలు సాగించడానికి ఈ కల్వర్టు ఎంతో కీలకంగా ఉంది. అయితే ఇటీవల కాలంలో పూర్తిగా శిథిల స్థితికి వంతెన చేరుకుంది. కల్వర్టు శ్లాబ్‌కు కూడా ఇటీవల పెద్ద రంధ్రం పడింది. శిథిలమైన కల్వర్టు మీదుగానే తప్పని పరిస్థితుల్లో వివిధ లోడ్‌లతో వాహనాలు వెళుతున్నాయి. సామర్థ్యం దెబ్బతిన్న ఈ కల్వర్టు ఎప్పుడైనా కూలిపోవడానికి సిద్ధంగా ఉందని స్థానికులు చెబుతున్నారు.

ప్రతిపాదనలు వెళ్లాయి

మెండుపాలెం వద్ద డ్రెయిన్‌పై కల్వర్టు పునర్నిర్మాణం పనులకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాము. రూ.కోటి ఏభై లక్షలకు ప్రతిపాదిస్తూ పూర్తిగా కల్వర్టు రీ కన్‌స్ట్రక్షన్‌కు ప్రతిపాదనలు పై అధికారులకు అందజేశాం.

– సురేష్, ఆర్‌అండ్‌బీ, జేఈ, రాజోలు

కల్వర్టును పునర్నిర్మించాలి

శిథిల స్థితికి చేరిన కల్వర్టు పునర్నిర్మాణంపై అధికారులు దృష్టి పెట్టాలి. తీర ప్రాంతాలకు కీలకంగా ఉన్న కల్వర్టును కొత్తది నిర్మించాలి. సామర్థ్యం దెబ్బతిన్న కల్వర్టు మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలకు ప్రమాదం పొంచి ఉంది.

– గెడ్డం అమ్ములు, అంతర్వేదికర

సామర్థ్యం దెబ్బతింది

మెండుపాలెం వద్ద శంకరగుప్తం మేజర్ డ్రైయిన్‌పై కల్వర్టు సామర్థ్యం పూర్తిగా దెబ్బతింది. ఇటీవల కాలంలో కల్వర్టు శ్లాబ్‌కు పెద్ద రంధ్రం కూడా పడింది. తీర ప్రాంత గ్రామాలను కలుపుతూ ఉన్న ఏకైక మార్గం ఇది.

– యెనుముల చిట్టిబాబు, కేశవదాసుపాలెం

బాబోయ్ ఇదేం ఉక్కపోత

రుతుపవనాలు ప్రవేశించినా జాడలేని వాన



అంబాజీపేటలో నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

అంబాజీపేట: వారం రోజుల క్రితమే రుతుపవనాలు ప్రవేశించాయి.. వర్షాలు కురుస్తాయని అంతా ఆశగా ఎదురుచూశారు... అయితే వర్షాలు లేవు సరికదా తీవ్రమైన ఉక్కబోత కారణంగా ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో చోటు చేసుకుంటున్న వాతావరణ పరిస్థితులతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వారం రోజుల క్రితం అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని అనుకుంటే నిరాశే ఎదురయింది. సాయంత్ర సమయంలో మేఘావృతమై ఉరుములతో చిరు జల్లులు కురివడం తప్ప భారీ వర్షం జాడ లేకపోవడంతో ఉక్కబోత ఊపిరాడనివ్వడం లేదు. ఇలా భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొనడం... వాతావరణంలో ద్రోణి, ఆవర్తనాలే ఇందుకు కారణమని నిపుణులు చెబుతున్నారు.

38 డిగ్రీలకు పైగా నమోదు

ఒక వైపు రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లో తీవ్రమైన వడగాలులు వీస్తున్నాయి. ఏప్రిల్, మేలో 40 డిగ్రీలకు పైగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రస్తుతం 38 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవతున్నాయి. దీంతో ప్రజలు ఉక్కబోతకు గురై వృద్ధులు, పిల్లలు అగచాట్లు పడుతున్నారు. గడిచిన కొద్ది రోజులుగా వాతావరణంలో సంభవించిన మార్పుల కారణంగా విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. పగలంతా ఎండ ప్రచండంగా ఉండగా.. సాయంత్రం కొద్దిగా చల్లబడుతుంది. సాధారణంగా జూన్ మొదటి వారంలో రుతుపవనాలు ప్రవేశిస్తుంటాయి. సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్న తరుణంలో వాన రాకకోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారు.

ఘనంగా గజమాల యాత్ర



మామిడికుదురు సెంటర్‌లో గజమాల యాత్ర

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి కల్యాణం సందర్భంగా దేవస్థానం వ్యవస్థాపకుడు మొల్లేటి రామస్వామి, ఆదిలక్ష్మి దంపతుల మెడలో ఆవిష్కరించే గజమాల యాత్ర ఊరేగింపు సోమవారం ఘనంగా జరిగింది. రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజోలు మండలం తాటిపాక శెట్టిబలిజ సంఘం భవనం నుంచి కేరళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ప్రారంభమైన యాత్ర మామిడికుదురు బస్టాండ్ కూడలి మీదుగా అప్పనపల్లి వరకు సాగింది. అప్పనపల్లి ఆలయం ప్రాంగణంలో ఉన్న రామస్వామి దంపతుల విగ్రహాలకు గజమాలను అలంకరించారు. శెట్టిబలిజ సంఘం యువత మోటార్ సైకిళ్లపై ర్యాలీగా ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గజమాల యాత్రలో పాల్గొన్నారు. యాత్రలో మండల శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీనివాస్, సంఘం ప్రతినిధులు వాసంశెట్టి శంకర రావు, జోగి వెంకటరామకృష్ణ, నయినాల రామకృష్ణ, పెచ్చెట్టి సత్యచంద్రరావు, కడలి నూకరాజు, పితాని సురేంద్ర, వాసంశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

యాదవ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడిగా నాగరాజు



కె.పెదపూడిలో నూతన కమిటీని సత్కరిస్తున్న యాదవ సంఘ నాయకులు

అంబాజీపేట: పి.గన్నవరం నియోజకవర్గ యాదవుల సంఘ అధ్యక్షుడిగా నాగళ్ల నాగరాజు ఎన్నికయ్యారు. కె.పెదపూడిలో నియోజకవర్గ యాదవుల సమావేశం జరిగింది. నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గొన్నూరు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చిట్టిమేను రమణ, జాయింట్ సెక్రటరీ గాలి వీర వెంకట బాలాజీ, ట్రెజరర్ మట్టా రెడ్డిలతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ సంఘ అభివృద్ధి సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. సంఘ అభివృద్ధికి సంఘ పెద్దలతోను, కమిటీ సభ్యులందరితో ముందుకు సాగుతానన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వెంకట సత్యనారాయణరాజు యాదవ్, వంత్రపాటి విఘ్నేశ్వరుడు, నూరిమేను సుబ్రహ్మణ్యం, మాగాపు సత్యనారాయణ, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థపై అవగాహన



సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలి గ్రామంలో అనూస్ స్వచ్ఛంద సంస్థ విద్యాబ్యాంక్ ఆధ్వర్యంలో ప్రభుత్వం నేను బడికి పోతాం కార్యక్రమంలో భాగంగా బాల కార్మిక వ్యవస్థపై పేద చిన్నారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ ఇంద్రజాలికుడు, ఉపాధ్యాయుడు చింతా శ్యామకుమార్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన అన్నపూర్ణ శేఖర్, వైజాగ్‌కు చెందిన మచ్చ నిరంజనకుమార్ సమకూర్చిన విద్యా సామగ్రి పేద చిన్నారులకు పంపిణీ చేశారు. వలస కూలీ చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అనూస్ సంస్థ అధ్యక్షురాలు అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో వేంచేసిన వేణుగోపాలస్వామి, ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి ఆలయాల్లో సోమవారం సాయంత్రం స్వామి వారి కల్యాణోత్సవాలు కనులపండువగా నిర్వహించారు. ఉదయం ఆలయ ఈఓలు భూపతిరాజు కిషోర్‌కుమార్, బి.కృష్ణచైతన్య ఆధ్వర్యంలో స్వామి వార్ని అర్చకులు ప్రత్యేక పువ్వులతో అలంకరించారు. అనంతరం వివిధ పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి కల్యాణోత్సవాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణోత్సవాలు తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

హామీలు అమలు చేయాలి



మామిడికుదురులో మత గురువు ఇబ్రహీంను సత్కరిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి

మామిడికుదురు: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి చిత్తశుద్ధితో అమలు చేయాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కోరారు. బక్రీద్ సందర్భంగా మామిడికుదురులో సోమవారం ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. మత గురువు మహ్మద్ ఇబ్రహీంను సన్మానించారు. మామిడికుదురులో గ్రీవెన్స్ సెల్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్య స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ చట్టం తమ పరిధిలోనిది కాదన్నారు. ఇది కేంద్రం పరిధిలోనిదని చెప్పారు. కూటమి తప్పుడు ప్రచారం నమ్మి ప్రజలు కూటమిని ఆదరించారని చెప్పారు. అదే నమ్మకాన్ని ప్రభుత్వం నిలుపుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు చేయడం దారుణమన్నారు. దీనిపై అధికారులు తక్షణం స్పందించాలని సూర్యారావు డిమాండ్ చేశారు. ఎవరికి ఏ కష్టం వచ్చిన వారికి పార్టీ అండగా నిలబడుతుందని గొల్లపల్లి హామీ ఇచ్చారు. పార్టీ శ్రేణులు డీలా పడే పరిస్థితి లేదన్నారు. ప్రజల పక్షాన సమస్యలపై పోరాటం చేస్తామని సూర్యారావు స్పష్టం చేశారు. పార్టీ నేతలు కంచి శ్రీరామ్, సర్కిల్ ముస్తఫా హైదర్, అన్వర్ తాహిర్ హుస్సేన్, కొల్లాబత్తుల వెంకట రమణ, అనిశెట్టి రాజు, చేగొండి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

భక్తిశ్రద్ధలతో ముస్లింల వేడుకలు



అంబాజీపేటలో ఖబరస్తాన్‌కు వెళుతున్న ముస్లింలు



మామిడికుదురులో మసీదుల్లో బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లిం పవిత్ర బక్రీద్ పండగను సోమవారం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. బక్రీద్‌ను పురస్కరించుకుని మామిడికుదురు షియా జామియా, సున్నీ జామియా మసీదుల్లో ప్రత్యేక నమాజులు జరిగాయి. మత ప్రబోధకులు మొహ్మద్ ఇబ్రహీమ్, తారిఖ్ అన్వర్ రజ్వీ బక్రీద్ విశిష్టతను భక్తులకు వివరించారు. ప్రవక్త ఇబ్రహీమ్ తన కుమారుడు ఇస్మాయిల్‌ను అల్లా సన్నిధిలో కుర్బానీ చేసేందుకు సిద్ధపడడం అతని భక్తికి మెచ్చిన అల్లా ఇబ్రహీమ్ ఇస్మాయిల్ స్థానంలో గొర్రెపోతును ప్రవేశ పెట్టిన వృత్తాంతాన్ని వివరించారు. మొగలికుదురు మసీదులో మొహ్మద్ ఇబ్రహీమ్ నగరం పెద పంజీషాలో హేబతుల్ హుస్సేన్ మాజింద్రాణి నమాజులను ఆలపించారు. దీనిలో భాగంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కమిటీ ప్రతినిధులు ఆబేద్ అలీ, కిష్వర్, అబ్బాస్ మాజింద్రాణి, మసూద్ మొహిద్దీన్, కల్బే ఆబేద్ మాజింద్రాణి, అసదుల్లా మసద్దీ, సర్కిల్ కల్బే అబ్బాస్ పాల్గొన్నారు. పెదపట్నం, కొమరాడ, మగటపల్లి గ్రామాల్లోని మసీదుల్లో కూడా బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కొత్తపేటలో..

కొత్తపేట: బక్రీద్ పర్వదినాన్ని మండలంలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక కమ్మిరెడ్డిపాలెం మసీదులో ముస్లింలు పెద్ద సంఖ్యలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదు, షాదీఖానా కమిటీ ప్రెసిడెంట్ షేక్ కాజాబాబు ఆధ్వర్యంలో వివిధ ఏర్పాట్లు చేశారు. మత గురువులు బక్రీద్ విశిష్టతను వివరించారు. తమ పూర్వీకుల ఆత్మశాంతి కోసం ప్రార్థించారు. ఒకరినొకరు అలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఎవరి స్థాయిలో వారు పేదలకు దానధర్మాలు చేశారు. అనంతరం ఎవరి ఇళ్లకు వారు వెళ్లి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో కలిసి విందు జరుపుకొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: త్యాగానికి ప్రతీకగా జరుపుకొనే బక్రీద్ పండగను మండలంలోని ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక పెద్దవీధిలో ఉన్న అంజుమనే ఇందాదుల్ ముస్లిమీన్ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అంబాజీపేట సెంటర్ మీదుగా ఖబరస్తాన్‌కు చేరుకుని మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎండీ రఫీ, పాషా, కరీం, జాకీర్, వలీ తదితరులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: త్యాగనిరతికి ప్రతీకగా బక్రీద్ పండుగ నిలుస్తుందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. సోమవారం ఆయన బక్రీద్ పురస్కరించుకుని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. రాజోలు, తాటిపాక, నగరం, మామిడికుదురు ప్రాంతాలకు చెందిన ముస్లింలను కలిశారు. ఈ సందర్భంగా గొల్లపల్లి మాట్లాడుతూ త్యాగం, దానగుణాలకు ఇస్లాంలో ప్రత్యేకమైన స్థానముందన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: త్యాగానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తుందని పలువురు ముస్లిం నేతలు వివరించారు. ఇస్లాం మత చరిత్రలో అబ్రహం, ఇస్మాయిల్ త్యాగనిరతికి సూచికగా ఏటా బక్రీద్ పర్వదినాన్ని జరుపుకోవడం ముస్లింలకు ఆనవాయితీగా వస్తుంది. మండలంలోని ఆలమూరు, పెదపళ్ల, నర్శిపూడి గ్రామాల్లోని మసీదులో బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ముస్లింలు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుని ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న విందును ఆరగించారు. మండలంలోని వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు ఆయా గ్రామాల్లోని మసీదుల వద్దకు వెళ్లి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా రామలింగేశ్వర స్వామి దివ్య కల్యాణం



రామలింగేశ్వర స్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీకామాక్షి పీఠం మహా సంస్థానంలో కొలువైన కామాక్షీ సమేత రామలింగేశ్వర స్వామివారి దివ్య కల్యాణం సోమవారం ఉదయం 8.46 గంటలకు వైభవంగా జరిగింది. పీఠాధిపతి కామేశ మహర్షి సమక్షంలో పండితులు స్వామివారి కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ పూజ్యం నాగేశ్వరశర్మ యాజ్ఞీకంలో రుత్విక్కులు కల్యాణ ఘట్టాన్ని కన్నుల పండువగా జరిపారు. కామాక్షీ దేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని తరించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మహిళలకు యోగాపై శిక్షణ ఇస్తున్న గురువు డాక్టర్ శ్రీనివాస్

అమలాపురం టౌన్: మహిళల్లో ఎదురయ్యే అనేక రకాల రుగ్మతలకు యోగా వల్ల పరిష్కార మార్గం లభించడమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని అమలాపురం స్వామి వివేకానంద యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ అన్నారు. స్థానిక జీవీ మాల్ మహిళా సిబ్బందికి సోమవారం ఉదయం నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ తరగతుల ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు యోగాతో పాటు సరైన ఆహార నియమాలు పాటిస్తే బీపీ, షుగర్, గుండె జబ్బులు, కీళ్ల నొప్పులు వంటి అన్ని రుగ్మతల నుంచి రక్షణ పొందవచ్చని సూచించారు.

ఉద్యమాలతోనే కార్మిక హక్కుల సాధన

అమలాపురం టౌన్: ఉద్యమాలు, పోరాటాలతోనే కార్మిక హక్కుల సాధన సాధ్యమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంప్లాయీస్ హౌస్‌లో సోమవారం జరిగిన సీఐటీయూ జిల్లా మహాసభకు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గుదే దుర్గా ప్రసాద్ అధ్యక్షతన జరిగిన జిల్లా మహాసభలో పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూకి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా గుదే దుర్గాప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా నూకల బలరామ్, కోశాధికారిగా కె.కృష్ణవేణి, ఉపాధ్యక్షులుగా ఎం.భాస్కరరావు, బండి లక్ష్మి, కార్యదర్శులుగా సత్యనారాయణ, మలక సుభాషిణిలను ఎన్నుకున్నారు. అనంతరం స్థానిక మున్సిపల్ కాలనీ వెనుక ఉన్న సీఐటీయూ నూతన జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. మహాసభలో రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ, జిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌చార్జీల పెంపుపై వ్యతిరేకత

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులపై చార్జీల భారం మోపుతూ విద్యుత్ రెగ్యులేటరీ అథారిటీ తీసుకున్న నిర్ణయంపై సామాన్య ప్రజలు మొదలు వ్యాపారవర్గాల వరకూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ మేరకు సోమవారం పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇకపై నెలవారీ గృహాలు తదితర విభాగాల విద్యుత్ వాడకం బిల్లుతో పాటు అదనంగా సర్‌చార్జి, పర్మినెంట్ సర్వీస్ చార్జి, ఆలస్య రుసుము, సర్వీసు చార్జిను సైతం వినియోగదారుల నుంచి వసూలు చేయనున్నారు. ఆ విధంగా నెలవారీ కిలోవాట్‌కు రూ.30 నుంచి రూ.35 అదనపు భారం పడుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు పరిశ్రమలకు పర్మినెంట్ సర్వీసు చార్జీలుగా కిలోవాట్‌కు రూ.75 నుంచి రూ.200 ఫిక్స్‌డ్ చార్జీలను, హైటల్టేజీకి రూ.420 వరకూ వసూలు చేయనున్నారు.

మంత్రి సుభాష్ దాతృత్వం



ఆర్థిక సాయం అందించిన మంత్రి సుభాష్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న శ్రీనివాస్, పద్మ దంపతులు

రామచంద్రపురం రూరల్: పుట్టుక నుంచి అంగవైకల్యంతో బాధపడుతున్న ఇద్దరు చిన్నారులతో నానా కష్టాలు పడుతున్న కుటుంబానికి తన పుట్టిన రోజు పురస్కరించుకుని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం రూ.లక్ష ఆర్థిక సాయం అందించి తన దాతృత్వం చాటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ద్రాక్షారామ శభాష్‌పేటకు చెందిన పెంటపాటి శ్రీనివాస్, పద్మ దంపతులకు పుట్టుకతోనే దివ్యాంగులైన వందన, ఆనంద్‌కుమార్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇద్దరూ మరొకరి సాయం లేకుండా కదలలేని స్థితిలో ఉండటంతో ఆ కుటుంబం నానా ఇబ్బందులు పడుతోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆ కుటుంబం పరిస్థితి చూసి చలించిన మంత్రి సుభాష్ తాను ఎన్నికల్లో గెలిచినా, ఓడినా కూడా ఎన్నికల అనంతరం ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తానని మాటిచ్చారు. సోమవారం తన పుట్టినరోజు పురస్కరించుకుని ఇచ్చిన మాట ప్రకారం ఆర్థిక సాయం అందించడంతో పాటు తన పుట్టిన రోజు నాడు ఏటా ఆ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తానని స్థానికులు హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, రాంబాబు దంపతులు, వార్డు సభ్యుడు కాళ్ల కురచ ఏడుకొండలు, టీడీపీ నాయకులు టేకుమూడి సత్యనారాయణ, దొంగల శ్రీధర్, చెల్లే శాస్త్రి, జనసేన నాయకులు కర్రా తాతీలు, ముప్పనపల్లి గణేష్, నున్న అశోక్, ఆళ్ల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.